# అక్కరకు వచ్చిన విద్య!



రచన : శ్రీ కె. ఓంశివ

పరీక్షలు పూర్తి అయ్యాయి. నేను అమ్మ కలసి చిన్నత్త కొడుకు పెళ్ళికని వైజాక్ వెళ్ళాం. ఉన్నంతలో బాగానే జరిపారు పెళ్ళితంతు. వదినా మరదళ్ళ సరసాలు, బావా మరదళ్ళ సరస సల్లాపాలతో మొత్తంమీద ఆ మూడు రోజులూ హాయిగానే గడిచాయి.

తిరిగి ఇంటికి ప్రయాణం కట్టాం. మా నాన్నగారు విజయనగరం దగ్గర వున్న చీపురుపల్లిలో మాస్టారుగా పని చేస్తున్నారు. మా అత్తవాళ్ళ ఇల్లు వైజాగ్ మర్రిపాలెం దగ్గరలోనే! ఏదో అర్జంట్‌గా పనితగిలి నాన్నగారు మాతో పాటు పెళ్ళికి రాలేక పోయారు.

మా మురళి స్టేషన్‌కెళ్ళి అమ్మకు, నాకూ టికెట్లు తెచ్చాడు. మర్రిపాలెం హాల్టు దగ్గర ట్రయిన్ ఎక్కుదామని మా ప్లాన్! నాకు ఇష్టమైన లేత ఆకుపచ్చ రంగు పంజాబీ డ్రస్ వేసుకున్నాను.

'అరుణా! ఆడదాన్నైన నాకే నీ అందం పిచ్చెక్కిస్తుందే. మరి మగాళ్ళ పరిస్థితి ఎలా వుంటుందో నిన్ను చూస్తే!' మా మాధవి నన్ను ఆటపట్టించే మాటలు గుర్తుకొచ్చి సన్నగా నాలో నేనే నవ్వుకున్నాను.

ఎలాగైతేనేం, అందరి దగ్గర సెలవు తీసుకొని మర్రిపాలెం హాల్టు దగ్గరకి బయలుదేరి వచ్చాం. మాతోపాటు మమ్మల్ని ట్రెయిన్ ఎక్కించడానికి మా పెద్దత్త కొడుకు శివరామ్, వాళ్ల ఫ్రెండ్స్ మొత్తం అయిదుగురు వచ్చారు.

ఏవో జోక్స్ కట్ చేసుకుంటూ కొంత సమయం గడిపాం. ఇంతలో ఎదురుగా పాసింజర్ వస్తూ కన్పించింది. నేను విశాఖ రావడం ఇది రెండోసారి మాత్రమే! ఇంతకు ముందొకసారి నాన్నగారితో వచ్చాను. అంతే!

నా ఆలోచనలకు ఆనకట్ట వేస్తున్నట్లుగా పాసింజర్ వచ్చి ఆగింది. బండి అంతా కిక్కిరిసినట్లుగా వుంది. ఎక్కడా ఖాళీలేదు! అసలు ఎక్కడానికే వీలుపడనంత రష్‌గావుంది! ఏమయితేనేం చివరి బోగి కాస్త ఖాళీ వున్నట్లనిపించి, అటువెళ్ళి, అది ఎక్కేశాం నేను, అమ్మ.

సామాను ఒక సూట్‌కేస్, రెండు బేగ్‌లు అందించారు క్రిందనున్న మా వాళ్ళు! అందించి చేయి వూపారు. అప్పటికే బండి కదలడం మొదలైంది! నేను అప్రయత్నంగా చేయి వూపాను.

బండి నెమ్మదిగా వేగం పుంజుకుంటుంది. బండిలో వున్న మగాళ్లు చాలామంది నా వంక తోడేలు చూపులు చూస్తున్నారు. బోగీ అంతా రద్దీగా వుంది! సూట్‌కేస్ క్రింద పెట్టడానికి జాగాలేదు, ఎంతసేపని పట్టుకుంటాను! అదీగాక సూట్‌కేస్ పైన కేరేజిలో పడేస్తే తప్ప, సరిగా నిలబడటం కూడా కుదరలేదు. సూట్‌కేస్ కేరేజీమీద పడేయబోయి, తూలి ఒక మధ్య వయస్కుడిమీద పడబోయాను. కాని నిలద్రొక్కుకున్నాను. నా చేతిలోని సూట్‌కేస్ అతనే తీసుకొని, కేరేజీమీద పడేసాడు.

అమ్మ, 'వద్దు క్రిందే పెట్టమని' వారిస్తుంది.

'ఎక్కడికి వెళ్ళాలని' అడిగాడతడే.

'చీపురుపల్లి' అన్నాను అప్రయత్నంగా నేను.

'అరే! చీపురుపల్లా! విజయనగరం వైపు కదా! ఇది

అనకాపల్లి వెళ్ళద్దే! ఇది ఎక్కేసారేంటి?' ఆశ్చర్యం, జాలి, మిళితమయిన కంఠంతో అన్నాడతడు.

రైలు పట్టాలమీదనుండి గాక నా గుండెలోనుండి పరుగెడుతున్నట్లనిపిస్తుంది. ఒక్కసారిగా గుండె ఆగి, మళ్ళీ కొట్టుకున్నట్లయింది. భయం వేసింది. ఎవరినీ అడగకుండా పెద్ద తెలిసిన వాళ్ళలాగ షోగ్గా బండి ఎక్కించిన మురళీ, వాళ్ళమీద విపరీతమైన కోపం ముంచుకొచ్చింది. అమ్మ ముఖం చూసాను. అమ్మ పరిస్థితి కూడా ఇంచుమించుగా అలాగే వుంది.

బోగిలోవున్న ప్రయాణికులు ఒక్కొక్కరు ఒక్కొక్క విధమైన సలహాను పారేస్తున్నారు. ఎవరో ఎక్కించిన వాళ్ళను కూడా లీలగా తిడుతున్నారు.

'అయ్యో! పాపం ఆడవాళ్ళు!' అంటున్నారు. నాకు ఒక్కసారిగా కోపం ముంచుకొచ్చింది. అయినా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితి!

ఒకాయన 'దువ్వాడవరకూ వచ్చి, అక్కడనుండి సింహాద్రి ఎక్కి, మళ్ళీ వైజాక్ వెళ్ళిపొండి!' అంటూ ఓ ఉచిత సలహా ఇచ్చాడు.

కాని మరొకతను ఆ సలహాను ఖండించారు. బండి దువ్వాడ వెళ్ళేసరికె సింహాద్రి వెళ్ళిపోతుందని.

ఒక స్టూడెంట్ అనుకుంటా, ఒక చక్కటి సలహా ఇచ్చాడు.

'బండి ఇప్పుడు కొత్తపాలెం హాల్టు దగ్గిర ఆగుతుంది. అక్కడ దిగి, అడ్డుగా నడిస్తె ఒకటిన్నర కిలోమీటరు వుంటుంది సింహాచలం స్టేషన్. అక్కడకు వెళ్ళిపోయారంటే రాయపూర్ పాసింజర్ ఈజీగా అందుతుంది.'

'అవుననుకో, కాని ఆ పాసింజర్ ఆరున్నరకి కదా!' ఈమాత్రం సలహా ఇవ్వడం మా చేత కాదనుకున్నావేమిటి? అనుకుంటూ ఈసడింపుగా అన్నాడు ముందు సలహా ఇచ్చినతను.

'ఆరున్నరకేగాని, గౌహతీ, త్రివేండ్రం, వివేకానందా ఎక్స్‌ప్రెస్ ఈవేళ లేటుగా వచ్చి, మనబండి కదిలినప్పటికి స్టేషన్‌లోనే ఉంది కదా! అది వదిలాకె రాయపూర్ పాసింజర్ వదులుతాడు. కాబట్టి అది సింహాచలం వెళ్ళేసరికి ఏడు అవుతుంది. అప్పుడు ఈజీగా అందుతారు' భరోసా ఇస్తున్నట్లుగా ఆ డవుట్ క్లెరిఫై చేసి బల్ల గుద్దినట్లుగా మరీ చెప్పాడు.

నాకా సలహా నచ్చింది. ఇంతలో బండి ఆగింది.

'ఇదే కొత్తపాలెం, కిందకు దిగండి!' అంటూ ఆ కుర్రాడు కూడా మాతోపాటి దిగాడు. దిగి ఎలా వెళ్లాలో తెలీదు. అతనే 'ఇదిగో ఈ డవున్ దిగి, అదిగో దూరంగా కనిపిస్తుందా బిడ్జి, దాని క్రిందనుండి వెళ్ళాలని దారి చూపించి, మళ్ళీ బండెక్కాడు.

మేము రెండడుగులు వేసేసరికి బండి కదిలిపోయింది.




మేలైన పొగాకుతో, అత్యుత్తమమైన
ఆకులతో, నిపుణులైన పనివారలచే
తయారు చేస్తున్నాము

మల్లీస్సేరీ బీడీలు

అత్యుత్తమమైనదని లక్షలాది
ప్రజలు వాడుతున్నారు

Grams : "Mallisseri" Phone : 24031

**Malliseri Beedi Works**

SULLIVAN STREET : : COIMBATORE-641 001.

పట్టాలు దాటి డవున్ దిగాం నేను, అమ్మ కలిసి. నేను సూట్ కేస్ ఒక చేతితో పట్టుకొని, మరొక చేతికి బేగ్ తగిలించాను. అమ్మ ఒక బ్యాగ్ పట్టుకొంది. అమ్మ చేయి పట్టుకొని నెమ్మదిగా నడిపించాను. టైం చూసాను. ఆరుంబావు దాటుతుంది.

అమ్మది కాస్త భారీ శరీరం! అమ్మ ఎప్పుడూ పెద్దగా దూరం నడిచి ఎరుగదు! ఇప్పుడు ఒకటిన్నర కిలోమీటరు నడవాలి! తప్పదు మరి! అమ్మ దుస్థితికి బాధగా నవ్వుకున్నాను.

చుట్టూ చూస్తాను! ఎక్కడో దూరంగా విసిరేసినట్లుగా వున్న ఇళ్ళల్లోనించి లైట్లకాంతి తప్ప ఏమీ కనిపించటంలేదు. అక్కడున్న ఇద్దరిని మళ్ళీ దారి అడిగి నా అనుమానం తీర్చుకున్నాను. అమ్మ కోపంగా వుందనుకుంటా. ఏమీ మాట్లాడలేదు. వాళ్ళు చూపించిన దిక్కువైపే నడక సాగించాను.

చల్లగా గాలి మమ్మలను డీకొట్టింది. కాస్త చలిగా వుంది. అప్పటికే చీకట్లు కమ్ముకున్నాయి! నెమ్మదిగా మొదలుపెట్టిన మా నడక కాస్త స్పీడునందుకుంది!

మా వెనుక కొంతదూరంలో ఏవో రెండు మగగొంతులు కిచుమంటున్నట్లుగా సణుగుడు వినిపిస్తుంది. అవి అంత ఎక్కడా జనసంచారం ఉన్నట్లుగా తోచదు.

కిచురాళ్ళు గోలగా అరుస్తున్నాయి! అంతా చీకటిగా వుంది. ఆకాశంలో తారలు మాత్రం మిణుగురు పురుగుల్లా మిణుకు మిణుకుమంటూ మెరుస్తున్నాయి! అవి ఒకటే దారిచూపు సాధనాలుగా ఉన్నాయి! అంతా అదొక రకమైన నిశ్శబ్దంతో నిండివుంది చుట్టుప్రక్కలంతా! వెనకనున్న గొంతులు మాకు దగ్గరవుతున్నాయి! నాలో భయం హెచ్చింది, అమ్మకు కూడా భయం వేసిందేమో నడక వేగం హెచ్చింది. నాకు దారి తప్పావేమోనని అనుమానం వేసింది. కాని వెనుకకు తిరగలేం కదా! ఏమైనా ముందుకె వెళ్ళాలి తప్పదు.

వాళ్ళు మా వెనుకగా వచ్చి ఏదైనా చేస్తె! అమ్మో... ఇంకేమైనా వుందా! నా కసలే చిన్న పిరికి...అమ్మకు చీకటి అంటే అసలే భయం! ఇక తప్పదు కాబట్టి, నేనే కాస్త ధైర్యం కూడదీసుకొని వేగంగా ముందుకు సాగాను అమ్మ చెయ్యి పట్టుకొని.

స్పీడుగా నడుస్తున్నాం! అయినా వాళ్ళు కూడా వేగం పెంచినట్లున్నారు. వాళ్ళ మాటలు మా దగ్గరగానే వినిపిస్తున్నాయి. ఒకవేళ నేనే అనవసరంగా భయపడుతున్నానేమో ననిపిస్తూంది...ఎటూ తేల్చుకోలేకపోతున్నాను. ఒక కిలోమీటరు వరకూ నడిచివుంటాం! గమ్యస్థానంమటుకు ఇంకా దూరంగానే వున్నట్లుంది. ఎక్కడా కనిపించటంలేదు. బాట సన్నగా పాములా వుంది. చుట్టూ పొదలు! ఇలాంటి అనుభవం ఎదురవడం జీవితంలో ఇదే ప్రథమం!

దారి వెంబడి పరిగెడుతున్నట్లుగా నడుస్తున్నాం, ఒక బ్రిడ్జి వచ్చింది. దాని క్రిందనుండే వెళ్ళాలి! వెళుతుండగా నా వీపుమీద ఏదో పడుతున్నట్లయింది! వెనుకకు తిరిగాను. ఒకడు నా మీద చేయివేసి వెకిలిగా నవ్వుతున్నాడు. నాకు ముచ్చెమటలు పోసాయి! కెవ్వున కేకవేసాను.

ఆ కేక నాకే వినిపించలేదు! కారణం పైన బ్రిడ్జిమీద నుండి గూడ్సు వెళుతోంది. ఆ శబ్దంలో కలిసిపోయింది నా కేక!

అమ్మ అది చూచి నోటమాట రానట్లుగా కొయ్యబారిపోయి చూస్తూంది తప్ప, ఏమీ చేయలేకపోయింది. రెండోవాడుకూడా మా వైపు వస్తూ కనిపించాడు. మొదటివాడు వెనక్కి చూసాడు. నేనా అవకాశాన్ని జారవిడుచుకోలేదు! ధైర్యంచేసి సూట్ కేస్‌తో నా శక్తినంతా ఉపయోగించి, బలంగా ఒక్కసారిగా వాడి బుర్రమీద బాదాను.

వాడు 'అమ్మా!' అంటూ అరుస్తూ క్రింద పడ్డాడు. తలకు బాగానే గాయం అయినట్లుంది. పైన గూడ్సు ఇంకా వెళుతూనే వుంది! ఒంటరి ఆడవాళ్ళంటే ఎంత చులకన వెధవలకు! సూట్ కేస్ తీయబోతూంటే రెండోవాడూ సమీపించాడు. నేనది కనిపెట్టి, వాడి గుండెల్లో ఒక తాపు తన్నాను. తన్నిన వెంటనే, వాడు తేరుకొనే లోపలే వాడికో రెండు కరాటే షాట్లు ఇచ్చాను. మొదటివాడిని కొట్టడం, కాస్త పొదలు అడ్డంగా వుండడంవలనా, అదీగాక బ్రిడ్జి క్రింద కాస్త చీకటిగా వుండడంవలనా, వాడు చూడలేకపోయాడు. అది నా అదృష్టంగా భావించాను. సమయస్ఫూర్తిగా వ్యవహరించగలిగాను.

రెండోవాడు కుప్పగా కూలిన వెంటనే, మొదటివాడు మళ్ళీ లేస్తాడేమోనని, వాడికో రెండు షాట్లు ఇచ్చాను. వాళ్లు మరో పావుగంటవరకు తేరుకోలేకపోవచ్చు! ఇక ఆలస్యం

చేయదలచుకోలేదు. అమ్మను దాదాపు ఈడుస్తున్నట్లుగా లాక్కెళ్లాను. ఐదు నిమిషాలు నడక నడిచింది. ఇంకా స్టేషన్ కనబడటంలేదు. గుండె దడదడమంటూ వేగంగా కొట్టుకుంటోంది! వాళ్లు మళ్ళీ వస్తే వాళ్ళను ఎలా ఎదురు కోవలసి వస్తుందోనని నా బుర్ర గబగబా ఆలోచించడం ప్రారంభిస్తూంది.

కాని అదృష్టవశాత్తూ, టర్నింగ్ తిరిగాక, దూరంగా స్టేషన్ లైట్లు కనిపిస్తున్నాయి. మహా అయితే మరో మూడు నిమిషాలు నడక! ప్రాణం కాస్త తెప్పరిల్లినట్లయింది!

అమ్మ పరిస్థితి ఇంకా కుదుటపడినట్లులేదు. మౌనంగా నడుస్తుంది! గబగబా వెళ్ళి స్టేషన్ చేరుకున్నాం! వెళ్ళి కాస్తా నీళ్లు త్రాగాం. ఇంతలో అంతా అయిపోయిన తరువాత తీరుబడిగా వచ్చే పోలీసులులా, నెమ్మదిగా వస్తూ కనిపించింది రా[illegible]ర్ పాసింజర్! వచ్చిన వెంటనే బండి ఎక్కేసాం. 'అదృష్టం కలిసొస్తే నడిసొచ్చే కొడుకు పుడతాడు' అన్నట్లు లక్కీగా రెండు సీట్లు దొరికాయి!

సీట్లలో కూర్చొని కాస్త రిలీఫ్ పీలయ్యాం. క్రొత్తగా నడక నేర్చుకొన్న కుర్రాడిలా, నెమ్మదిగా బండి కదలడం మొదలయ్యింది. టైం ఏడు గంటలు చూపిస్తూంది. శీతాకాలం కావడంవలన వేగంగా చీకటి పడింది! ఆ సంగతి అప్పుడు స్మరణకొచ్చింది. బండి నెమ్మదిగా వేగం పుంజుకుంటోంది! దూరంగా స్టేషన్ కనిపిస్తోంది! జరిగినదంతా ఒక కలలాగనిపిస్తోంది!

ఇంట్లో తెలీకుండా నా ఫ్రెండ్ విజయ అన్నయ్య దగ్గర నేర్చుకున్న కరాటే విద్య కాస్తయినా నాకు ఇప్పుడు ఇలా ఉపయోగపడింది. ఏమయితేనేం నేను, అమ్మ మాన ప్రాణాలు రక్షించుకోవడానికి ఉపయోగపడిన కరాటే విద్యకు, అది నేర్పిన విజయ అన్నయ్యకు, మనస్సులోనే ధన్యవాదములు అర్పించుకున్నాను.

అప్పుడనుకున్నాను 'అక్కరకు రాని చుట్టాలుంటారు కాని, అక్కరకు రాని విద్య ఏదీ ఉండబోదని!'

